విశాలాంధ్ర
శ్రీకాకుళం
బుధవారం 12, ఫిబ్రవరి, 2025


14న బుడితి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌కి అంతరాయం : ఏఈ రమేష్

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం 33/11 కేవీ బుడితి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 14 శుక్ర వారం విద్యుత్ సరఫరా నిలుపబడుతుందని సారవ కోట విద్యుత్ ఏఈ జజ్జి రమేష్ తెలిపారు. టెక్కలి డి ఈ శంకర్రావు ఆదేశాల మేరకు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని ఏఈ తెలిపారు. ఆరోజు ఉదయం 5 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని రమేష్ అన్నారు. ఈ సందర్భంగా బుడితి, చీడిపుడి, అవలింగి, బద్రి, గుమ్మపాడు పలు గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల ఉంటుందని ఆయన తెలిపారు వినియోగదారులు అదరూ సహకరించాలని ఏఈ కోరారు.

ఉద్దానం కలలకు పుట్టినిల్లు

- హైకోర్టు అడ్వకేట్, విశ్రాంతి డిఎస్పి ఎస్‌వివి ప్రసాదరావు
- ఘనంగా ముగిసిన ఉభయ రాష్ట్రాల నాటిక పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్తం
- అందరి సమిష్టి కృషితోనే ఘనవిజయం నిర్వాహకులు బల్లెడ లక్ష్మణమూర్తి

విశాలాంధ్ర - కవిటి : ఆహ్లాదకర వాతావరణం,పచ్చని ప్రకృతి సోయగాలు మరో కోనసీమను తలపించే ఈ ఉద్దాన ప్రాంతం కలలకు పుట్టినిల్లుగా మారిందని హైకోర్టు అడ్వకేట్, విశ్రాంతి డిఎస్పి ఎస్ వి వి ప్రసాద్ రావు అన్నారు. మండలంలోని బోరువంక గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర శర్మ స్మారక కళా వేదికలో కళింగ సీమ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన బల్లెడ అనసూయమ్మ స్మారక ఉభయ రాష్ట్రాల ఆహ్వానిత నాటిక పోటీలు ఘనంగా ముగిసాయి. గత మూడురోజులుగా జరుగుతున్న ఈ నాటిక పోటీల్లో ఉభయ రాష్ట్రాలకు చెందిన ఆరు నాటికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సోమవారం అర్ధరాత్రి బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు అడ్వకేట్, విశ్రాంతి డిఎస్పి ప్రసాదరావు మాట్లాడుతూ గత దశాబ్దాలుగా ఈ ఉద్దాన ప్రాంతంలో ఎన్నో నాటక పరిషత్తులు నిర్వహించారని ఎంతోమంది కళాకారులకు పుట్టినిల్లుగా మారిన ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో నిష్ణాతులైన కళాకారులు ఉన్నారని అన్నారు. మారుమూల ప్రాంతాలైన ఈ గ్రామంలో ఇటువంటి నాటిక పోటీలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన కళింగ సీమ కళాపీఠం అధ్యక్షులు బల్లెడ లక్ష్మణమూర్తి మాస్టారికి ఉద్దాన ప్రాంత కళాకారులంతా, కళాభిమానులు, ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమం నిర్వాహకులు, కలింగ సీమ కళా పీఠం అధ్యక్షులు లక్ష్మణమూర్తి మాస్టారు మాట్లాడుతూ బల్లెడ అనసూయమ్మ స్మారక ఆహ్వానిత ఉభయ రాష్ట్రాల నాటిక పోటీలు గత మూడు రోజులుగా నిర్వహించేందుకు అందరి సమిష్టి కృషితోనే విజయవంతం అయ్యిందని అన్నారు. ఇందుకుగాను సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఈ నాటిక పోటీలు మా గ్రామంలో నిర్వహించేందుకు కర్త,కర్మ, క్రియ ప్రముఖ దర్శకులు కేకేఎల్ స్వామి అని ఆయన సహకారం ఎన్నటికీ మరువలేనిదని అన్నారు. ఇటువంటి సహాయ సహకారాలు ఉంటే వచ్చే ఏడాది కూడా పరిషత్ పోటీలు నిర్వహించేందుకు ముందుకు వస్తానని అన్నారు. ప్రస్తుతం టీవీలకు అతుక్కుపోతున్న తరుణంలో ఇటువంటి నాటిక పోటీలను తిలకించేందుకు మండలంలోని వివిధ ప్రాంతాలతో పాటు అన్ని గ్రామాల నుంచి వేలాదిగా ప్రేక్షకులు హాజరవ్వడం ఎంతో ఉత్తేజాన్ని ,ఉత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా న్యాయ నిర్ణేతలతో పాటు పలువురు అనంతరం జరిగిన బహుమతి ప్రధనోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి "ఇంద్రప్రస్తం" నాటిక నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి "నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత" నిలువగా జ్యూరీ విభాగంలో తృతీయ బహుమతిని అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి "చిగురుమేఘం" నాటిక ఎంపికయింది. వ్యక్తిగత బహుమతుల్లో భాగంగా ఉత్తమ నటుడు నిశ్శబ్దమా నీ ఖరీదంత నాటికలో పీవీ వరప్రసాద్ , ఉత్తమ నటి జనరల్ బోగి నాటికలో సావిత్రమ్మ పాత్రధారి సురభి ప్రభావతి, ఉత్తమ విలన్ నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత నాటికలో పల్లవి పాత్రధారి డి హేమ , ఉత్తమ క్యారెక్టర్ నటుడు ఇంద్ర ప్రస్తం నాటికలో సర్వేశ్వరరావు పాత్రధారి ఎన్ రవీంద్ర రెడ్డి , ఉత్తమ రచన విభాగంలో జనరల్ భోగి నాటిక పిటి మాధవ్, ఉత్తమ దర్శకత్వం విభాగంలో ఇంద్రప్రస్తం నాటిక దర్శకుడు ఎన్ రవీంద్రారెడ్డి, ఉత్తమ సంగీతం విభాగంలో ఇంద్ర ప్రస్తం నాటిక వి.లీలామోహన్, ఉత్తమ ఆహర్యం లో భాగంలో నిశ్శబ్దమా నీ ఖరీదంత నాటిక కు గాను ఎస్.రమణ, ఉత్తమ రంగాలంకరణ విభాగంలో ఇంద్రప్రస్తం నాటికగాను ఎం భీమకుమార్ తోపాటు మరో ఐదు వ్యక్తిగత బహుమతులను పలువురు నటులు దక్కించుకున్నారు.వీరందరికీ ముఖ్య అతిథులు ఆత్మీయ అతిథులు మెమోటోలను,నగదు పారితోషకాలను అందజేశారు.స్థానిక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విఆర్వోల సంఘ సభ్యులు వజ్జ బాలకృష్ణ, పూడి నేతాజీ, పూడి వరప్రసాద రావు, దుద్ది సతీష్ కుమార్, బెందాళం విజయ్ కృష్ణ, సీపాన వెంకటరమణ, బార్ల చినబాబు, మాదిన రామారావు, టీవీ రమణ, బొడ్డ జయరాం, నల్లాన వేణుగోపాల్, బల్లెడ తేజేశ్వరరావు, బల్లెడ జయప్రకాష్, బల్లెడ శ్రీపతి, బోరివంక యువత తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని కాపాడుకుందాం

బందుకు మద్దతు ప్రకటించిన న్యూ డెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు

విశాలాంధ్ర - మెలియాపుట్టి : 1/70 చట్టం పకడ్బందీగా అమలు చేయాలనీ ఏజెన్సీ బందుకు న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మెలియాపుట్టి మండలం రింపి గ్రామంలో మంగళవారం నిర్వహించిన బందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ 1/70 చట్టం సవరించాలని ఏకో టూరిజన్న అమలు చేయాలని చేసిన వ్యాఖ్యానాలను సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తీవ్రంగా ఖండిస్తుందని మాధవరావు అన్నారు. 1/70 సవరణ వెనుక కార్పొరేటర్లకు ఆదివాసి భూములు కట్టబెట్టే కుట్ర దాగి ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలంలో ఏజెన్సీబందుకు మద్దతుగా రింపి, ముకుందాపురం, నేలబంతు తదితర గ్రామాల్లో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఏజెన్సీ బంద్ 11, 12 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో ఆదివాసీల సమస్యల ప్రస్తావించారు. జిల్లాలో ఆదివాసి గ్రామాలు 5వ షెడ్యూల్లో చేర్చబడలేదని, 1/70 చట్టం వర్తించడం లేదని, ఆదివాసీలంతా తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నారన్నారు. 5వ, 6వ షెడ్యూల్, పీసా చట్టం అటవీహక్కుల చట్టం, ఆదివాసీలకు అనుకూల చట్టాలు అమలు చేయడం లేదని మహోత్తర శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాట ఫలితంగా దేశ వ్యాప్తంగా ఆదివాసుల భూములు రక్షించడం కోసం వచ్చిన 1/70 చట్టం ఇవాళ సవరించి ఆదివాసి ప్రాంతంలో వనరులను బహుళజాతి సంస్థలకు బడా కార్పొరేటర్లకు కట్టబెట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని, ఆదివాసీల పైన కూటమి ప్రభుత్వానికి చిత్త శుద్ధ ఉంటే స్పీకర్ ను తొలగించాలని, ఆదివాసీలకు అన్యాయం చేసే ఏ నిర్ణయాన్ని అయినా ప్రతిఘటించడంలో ఆదివాసీలంతా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వంకల మాధవరావు తోపాటు ముకుందాపురం సర్పంచ్ భాస్కరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం మెలియాపుట్టి మండల అధ్యక్షులు శ్రీను, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ప్రభావతి, నారాయణరావు, వెంకట్రావు, గిరిజనులు తదితరులున్నారు.

ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.కృష్ణమూర్తి

విశాలాంధ్ర - టెక్కలి : ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో స్థానిక భవాని నగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో ఉచితంగా విద్యను అందిస్తుందని దీనిని ప్రతి ఒక్క విద్యార్థి వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థులతో మమేకమై వారు చదువుతున్న తరగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలను వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు, ఆట స్థలాన్ని ఆర్డిఓ పరిశీలించారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం విషయంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించి రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని హాస్టల్ అధికారులకు తెలిపారు. హాస్టల్ తో పాటు హాస్టల్ పరిసర ప్రాంతాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పంచాయతీ ఈవో జగన్నాధరావు, హాస్టల్ సహాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్నాళ్ళు ఈ ట్రాఫిక్కు అంతరాయం... ప్రయాణికుల ఆందోళన

విశాలాంధ్ర - జలుమూరు : మండలం తిలారు రైల్వే స్టేషన్ సమీపానగల గేటు వద్ద ప్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు నేపథ్యం గత నెల రోజులుగా పాతపట్నం సారవకోట నుండి వచ్చే వాహనాలు చల్లవానిపేట నుండి జర్జంగి మీదుగా నరసన్నపేట వెళ్లడం అదనంగా ఏడు కిలోమీటర్లు భారం పడుతుందని పలువురు ప్రయాణికులు ఆందోళన చెందతున్నారు. ఆర్టీసీ వారు మాత్రం కిలోమీటర్లు తగ్గట్టే ధరలు పెంచుకున్నారని పలువురు ప్రయాణికులు తెలిపారు. వంతెన నిర్మాణ పనులు జాప్యం జరుగుతున్నందున చల్లవానిపేట కూడలిలో తిలారు వైపు వెళ్లకుండా ట్రాఫిక్ అంతరాయం కలిగించడం అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. పది రోజులు ఐదు రోజులు ఉంటాయి గాని ఇలా నెలల తరబడి ట్రాఫిక్ డైవర్స్ చేయడం బాధాకరంగా ఉందని పాతపట్నం పర్లాకిమిడి నుండి వచ్చే ప్రయాణికులు వాపోతున్నారు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిన పనులు శరవేగంతో జరిగితే ఆనందంగా ఉంటుందని మరి కొంతమంది బాహటంగా అంటున్నారు. ఈ అంతరాయంపై ఉన్నతాధికారులు పరిశీలన చేసి ప్రయాణికులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వర్శిటీకు "పాత్రికేయ రంగంలో నా అనుభవాలు" పుస్తకాలు బహుకరణ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : సీనియర్ జర్నలిస్ట్, రచయిత దాసరి ఆళ్వార స్వామి స్వీయరచనలో వెలువడిన 'పాత్రికేయ రంగంలో నా అనుభవాలు' టైటిల్ తో ఉన్న 60 పుస్తకాలను డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం గ్రంథాలయం, జర్నలిజం విభాగానికి ఆయన అందజేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజని చేతులు మీదుగా వర్శిటీ గౌరవ లైబ్రేరియన్ డా. ఎన్. గోవిందరాజు, జర్నలిజం శాఖ అధ్యాపకులు డా. జి.ఎల్.వి.ప్రసాదరావులు మంగళవారం వీటిని స్వీకరించారు. ఎంతో సహృదయం, అంకితభావంతో పుస్తకాలు వర్శిటీకు పంపించిన ఆళ్వారస్వామిని ఈ సందర్భంగా వీసీ అభినందించారు. జర్నలిజం విద్యార్థులకు, పాత్రికేయులకు ఈ పుస్తకం ఎంతో మార్గదర్శిగా, నిఘంటువుగా ఉపయోగ పడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రెక్టార్ ఆచార్య బి. అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఓ.ఎస్.డి డా.యు.కావ్యజ్యోత్స్న, డా. కె. ఉదయ్ కిరణ్ లు పాల్గొన్నారు. కాగా, కృష్ణా జిల్లా కుందేరులో 1943లో జన్మించిన ఆళ్వారస్వామి, సుమారు 46 సంవత్సరాలు పాత్రికేయ రంగంలో ఆరు వేలకుపైగా పలు సామాజిక, చైతన్యకర రచనలు, వ్యాసాలు రాశారు. వ్యవసాయ, గ్రామీణ రంగ జర్నలిజానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రచనలు చేశారు. ఇప్పటివరకు వివిధ అంశాలుపై సుమారు 52 పుస్తకాలను వెలువరించారు. కాశీనాథుని నాగేశ్వరరావు విశిష్ట జర్నలిజం పురస్కారం, నార్ల వెంకటేశ్వరరావు విశిష్ట జర్నలిజం పురస్కారం, రైతు నేస్తం అవార్డు, డా. ఐ.వి. సుబ్బారావు అగ్రి జర్నలిజం అవార్డు, మోటూరు హనుమంతు స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు వంటి పురస్కారాలను అందుకున్న ఆళ్వారస్వామి ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ గా పలు పత్రికలకు, మ్యాగజైన్లకు రచనలు రాస్తున్నారు.

ఎమ్మెల్సీగా 'పాకలపాటి రఘువర్మ'ను గెలిపించండి



విశాలాంధ్ర - నరసన్నపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న పాకలపాట రఘు వర్మను అత్యధిక మెజార్టీతో గెలి పించాలని ఏ.పి.టి.ఎఫ్ 257.ఇన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, పాండురంగ వర ప్రసాద్ కోరారు. మంగళవారం పట్టణంలో పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా వరప్రసాద్ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం కృషి చేస్తున్న రఘువర్మను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.వి.రమణ, ఎన్.చంద్రశేఖర్, ఎస్.ఎల్.టి.పి సభ్యులు, బి.రామచంద్రరావు, పీస నర్శింహమూర్తి, ఎన్.శ్రీనివాసరావు తదితరులు

65 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - హిరమండలం : ప్రతీ గర్భిణీ స్త్రీ క్రమం తప్ప కుండా వైద్య పరీక్షలు, సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలని హిరమండలం పిహెచ్‌సి వైద్య అధికారిని సిహెచ్ సాయి గీత పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎం ఎస్ఎంఎ కార్యక్రమం ద్వారా 65 మంది గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ తదితరపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారిని సాయి గీత మాట్లాడు తూ 65 మంది గర్భిణీ లకు వైద్య పరీక్షలు నిర్వహించగా వాటిలో 8 మంది గర్భిణీ లు ప్రమా దకర గర్భిణీ లు గా గుర్తించడం జరిగిందని వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమనకు విచ్చేసిన గర్భిణీ లకు, ఆశ కార్యకర్తలకు, సిబ్బంది కి ప్రేమ సాయి వృధా శ్రమం నుంచి మధ్యాహ్నభోజనాలు ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జేమ్స్ ఆసుపత్రి నుంచి గైనికాకాలాజిస్ట్ వైద్యులు కే.దివ్య, రేడియాలాజిస్ట్ డాక్టర్ రమ్య, డాక్టర్ షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలి

విశాలాంధ్ర - నరసన్నపేట : విధ్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వంట ఏజెన్సీ మహిళలు అందచేయాలని మండల విద్యా శాఖాధికారి-1, ఉప్పాడ శాంతారావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని గొట్టిపల్లి పంచాయితీ రెడ్డికపేట గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఈ సంధర్భంగా ఆయన పాఠశాలకు చెందిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విధ్యార్థులకు వంట ఏజెన్సీ మహిళలు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూకు అనుగుణంగా ప్రతీరోజు వంటలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కె.జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పురందేశ్వరి సమక్షంలో బీజేపీ చేరిన సిరిపురం నాగరత్నం

విశాలాంధ్ర - టెక్కలి : ఇటీవలే శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆదివారం సిరిపురం నాగరత్నం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మర్యాద పూర్వకంగా కలుసుకొని ఆమె సమక్షంలో బిజెపి పార్టీలో చేరినట్లు సిరిపురం నాగరత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం నాగరత్నం మాట్లాడుతూ ప్రధాని మోదీ విధానాలు నచ్చాయని, మోదీ నాయకత్వంలో పని చేయడానికి బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం, బలోపేతం కోసం తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందన్నారు. మహిళల సాధికారిత కోసం మోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు.

మాజీ జెడ్పీటీసీ దున్న వీరయ్య స్వామి మృతి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం అమలపాడు గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి దున్న వీరయ్య స్వామి సోమవారం మృతి చెందారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ ప్రైవేట్ హాస్పిటల్లో మృతి చెందారు. వీరస్వామి మృతి గ్రామానికి మండలానికి తీరం లోటని గ్రామస్తులు పేర్కొన్నారు. వీరస్వామి మృత దేహానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పారినాయుడు కృషి ఫలించేనా?

దేవుడు మాన్యం ఆక్రమణలపై స్పందించిన కంచిలి ఎస్ఐ

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - సోంపేట : కంచిలి మండలం అంపురం రెవెన్యూ పరిధిలో పెద్దశ్రీరాంపురంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూముల్లో కొనసాగుతున్న ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై కంచిలి ఎస్సై పారినాయుడు ఎట్టకేలకు స్పందించారు. విశాలాంధ్ర పత్రికలో మంగళశారం దేవుడు భూమిలో ఆక్రమణల పర్వం అన్న శీర్షికన వెలువడిన కథనంపై ఎస్సై పారినాయుడు మంగళవారం ఉదయమే అక్రమ కట్టడాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. వెంటనే రామలింగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి కమిటీని స్టేషన్‌కు పిలిపించారు. అంపురం సమీపంలో ఉన్న 3ఎకరాల 9 సెంట్ల రామలింగేశ్వర స్వామి ఆలయ మాన్యానికి సంబంధించిన రికార్డులు, డాక్యుమెంట్లుతో కమిటీ సభ్యులు హాజరయ్యారు. వీరి నుంచి ఎస్సై పలు వివరాలను సేకరించారు. ఈ క్రమంలోనే కమిటీ ప్రతినిధులు పత్రి ఢిల్లేశ్వరరావు, పత్రి వాసుదేవ్, పత్రి వెంకటరమణ, పత్రి ప్రకాష్, పత్రి సుందరరావు, పత్రి మోహన్ తాజాగా మరో ఫిర్యాదును ఎస్సైకు అందజేశారు. సుధీర్ఘ కాలంగా దేవుడు భూముల్లో జరుగుతున్న అక్రమాలు గూర్చి ఎస్సై వద్ద పూస గుచ్చినట్లు వివరించారు. దీనిపై ఎస్సై స్పందిస్తూ నిర్మాణాలు చేపడుతున్న వారిని పిలిపించి విచారణ చేస్తానని పేర్కొన్నారు. దీని పట్ల ఎస్సై పారినాయుడు కృషి ఎంత వరకు ఫలిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

వృద్ధురాలిపై అనుమానంతో హత్య

పోలీస్ దర్యాప్తులో కుమారుడు, కోడలు వాంగ్మూలం

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం జింకిభద్రలో సోమవారం రాత్రి జరిగిన హత్య సంఘటనలో సాహుకారి రత్నాలు మృతి చెందిన విషయం విధితమే. స్వయాన భర్త సాహుకారి ఢిల్లేశ్వరరావు మద్యం సేవించి వచ్చి మైకంలో భార్యను చంపాడని అందరూ భావించారు. ఉదయాన్నే కాశీబుగ్గ డిఎస్పీ డి.వెంకటప్పారావు, సోంపేట సీఐ కె.మంగరాజు, ఎస్సై లవరాజు తదితరులు చేపట్టిన ప్రాథమిక దర్యాప్తులో ఢిల్లేశ్వరరావు కొడుకు,కోడలు నుంచి ఆసక్తికరమైన విషయాలు వెలువడ్డాయి. 64 ఏళ్ల వయసు ఉన్న రత్నాలు చెడు తిరుగుళ్లు తిరుగుతుందని ఆ కారణంగానే ఆమెను గొడ్డలితో కొట్టి చంపానని ఢిల్లేశ్వరరావు కొడుకు దివాకర్, అతని భార్య పోలీసుల వద్ద పేర్కొన్నారు. హత్య జరిగిన సమయంలో తల్లిదండ్రులు నివశిస్తున్న ఇంటి పై అంతస్తులో ఇద్దరం ఉన్నామని, ఆదరాబాదరాగా తన తండ్రి ఢిల్లేశ్వరరావు వచ్చి అమ్మ చనిపోయిందని, చెడు తిరుగుళ్లు తిరుగుతుందని పలు మార్లు గొడవలు జరిగినా పట్టించుకోవడం లేదని అందుచేతనే కోపంతో ఇలా చేశానని తండ్రి పేర్కొన్నట్లు దివాకర్ పేర్కొనడం గమనార్హం. దీనివల్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 64 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధురాలిపై ఇటువంటి అనుమానాలు ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. నిందితుడు ఢిల్లేశ్వరరావును అరెస్ట్ చేశారు. ఎస్సై లవరాజు కేసు నమోదు చేశారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆవరణలో అన్న సంతర్పణ

విశాలాంధ్ర - జలుమూరు: మండలం చిన్నదూగాం పంచాయతీ తిలారు జంక్షన్లో కొలువైయున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉచిత అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు కార్యనిర్వహణ అధికారి సూచనతో మాజీ సర్పంచ్ సీనియర్ నాయకుడు పీస రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల నలుమూలల నుండి వేలాది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

రైతులు మట్టి నమూనా పరీక్షలు చేసుకోవాలి

విశాలాంధ్ర - నరసన్నపేట : రానున్న ఖరీఫ్ సీజన్‌లో పండించే వరి పంటకు ఎటువంటి తెగుళ్ళు, పురుగులు ఆశించకుండా రైతులు తమ పొలాల్లోని మట్టిని పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయా ధికారి, కె.సునీత అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని కంబకాయ, కరగాం గ్రామాల రైతు సేవ కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా సునీత కార్యక్రమానికి హాజరైన రైతులను ఉద్దేశించి మాట్లా డుతూ రబీ పంటల కోతల అనంతరం పొలాలను లోతు దుక్కులు చేసుకోవాలన్నారు. దీనివలస మట్టిలో పురుగుల లార్వాలు ఎండకు కరిగి, ఖరీఫ్‌లో తెగుళ్ళు పంటలకు ఆశించకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, పాగోటి అప్పల నాయుడు, వంగ శ్రీరాములు, సవర శ్రీనివాస రావు, పాగోటి ప్రభాకరరావు, చెట్టు కృష్ణమూర్తి, అగ్రికల్చర్ అధికారి, చందన తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతను పఠించండి

విశాలాంధ్ర - నరసన్నపేట : మానవ జన్మ ఎత్తిన ప్రతీ ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను పఠించాలని ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక-తలసముద్రం కమిటీ అధ్యక్షులు, శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలో సుందరాపురం, కూర్మనాధపురం, పారశిల్లి, తెలగవలస, చెన్నాపురం తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మాఘ మాసంలో మాఘ పౌర్ణిమ, రధ సప్తమి, మహాశివరాత్రి తదితర పండుగల గూర్చి త్రైత సిద్ధాంత భగవద్గీలో పేర్కొనటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, రాము, కృష్ణ, తిరుమల, మౌనిక, తేజ, రమేష్, జ్యోతి, సాయి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత

ప్రజాగ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికే తన మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాగ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి ఎమ్మెల్యే శంకర్ వినతులు మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంతో పాటు రూరల్, గార మండలాల్లో పల్లెపండుగ ద్వారా గుర్తించిన సమస్యలను ఇప్పటికే శంకుస్థాపన చేశామన్నారు. వీటితో పాటు ప్రజాగ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వ్యక్తిగత వినతులతో పాటు, రోడ్లు, విద్యుత్, కాలువలు తదితర సమస్యలకు సంబంధించిన వినతులు సైతం స్వీకరించారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సాధ్యమయ్యేందుకు అవకాశం ఉన్న సమస్యలకు పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రజల నుంచి పింఛన్ కావాలని, ఇళ్లు కావాలని దరఖాస్తులు వస్తున్నాయని, వీటితో పాటు గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పించాలని కోరుతూ వినతులు అందజేస్తున్నారని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధులను ఇతర సంక్షేమ పథకాలకు వినియోగించుకోవడంతో గ్రామాల్లో అభివృద్ధి బాగా కుంటుపడిందన్నారు. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా అపారిశుధ్యం తాండవిస్తోందని, తాగునీరు, విద్యుత్, డ్రైన్లు వంటి కనీస అవసరాలను కూడా గత ప్రభుత్వం తీర్చక పోవడంతో ఆ భావం కూటమి ప్రభుత్వంపై పడిందని తెలిపారు. గత పాలనలో అరాచకం, అవినీతి, అరెస్టులు తప్ప పేదలకు గురించి, అభివృద్ధి గురించి ఆలోచించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో 30 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందని, వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టాయన్నారు. మరలా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. దోచుకున్నాం.. దాచుకున్నాం అన్న రీతిలోనే గత ప్రభుత్వం పాలన సాగిందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి రాక్షస పాలనకు స్వస్తి చెప్పేందుకు ఓటర్లంతా టీడీపీవీ ఆదరించి అఖండ విజయాన్ని అందించారన్నారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా వారికి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని మరో 30 ఏళ్ల పాటు గెలిపించుకుంటామని ప్రజలు చెబుతుండడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎనీవేర్ పద్ధతిలో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలి

స.హ.చ.రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు డిమాండ్

విశాలాంధ్ర - టెక్కలి : గతంలో రిజిస్ట్రేషన్ జరిగినా పరిశీలించకుండా ఎనీవేర్ పద్ధతిలో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన రైతు భూమి హక్కులను భంగం కలిగించిన సబ్ రిజిస్ట్రార్లపై తక్షణమే చట్టపరమైన తీసుకోవాలని కోరుతూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ కమీషనర్, డి.ఐ.జీ.లకు పిర్యాదు చేసినట్లు సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖ రావు తెలిపారు. ఈ సందర్భంగా టెక్కలిలో తొలుసూరుపల్లి రోడ్డులో గల సంఘం కార్యాలయంలో సోమవారం ఆ ప్రతులను పత్రికలకు విడుదల చేసారు. టెక్కలి మండలం చింతలగార రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 8-2 లో రెండు ఎకరాలు భూమిని 1978 లో కృష్ణ చంద్ర గంతాయత్ అతని సోదరులు వద్ద గూన యర్రయ్య కొనుగోలు చేసారు.ఆ భూమిలో ఎకరా భూమిని తిర్లంగి సత్యంకు 1998 లో గూన యర్రయ వారసులు రిజిస్ట్రేషన్ దస్తావేజు ద్వారా అమ్మివేశారు.నాలుగు దశాబ్దాలుగా ఆ భూమిని కొనుగోలు చేసిన రైతు కుటుంబాల సంపూర్ణ స్వాధీన సాగు అనుభవంలో ఉన్నాయి. ఈ భూమిని కాజేయడానికి కొంతమంది భూమికి సంబంధం లేని వ్యక్తుల పేరుతో రెవెన్యూ అధికారుల సహకారంతో 1బి జారీ చేయించారు.అయితే ఈ భూమి టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1978,1998 లలో రిజిస్ట్రేషన్ జరిగింది.టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తే భూమి గల రైతులకు విషయం తెలుస్తుందని భావించిన టెక్కలి సబ్ రిజిస్ట్రార్ పి. బాలామణి భూమిని అక్రమంగా కబ్జా చేయాలని ప్రయత్నించిన వ్యక్తులకు కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ జీ.రాజులు వద్దకు వెళ్ళమని సలహా ఇచ్చినట్లు తెలిసింది. గతంలో రిజిస్ట్రేషన్ జరిగినా ఎటువంటి రికార్డులు పరిశీలన చేయకుండా కాసులకు కక్కుర్తిపడి ఎనీవేర్ పద్ధతిలో 2021లో రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడినారు.ఈ విషయంలో బాధిత రైతులకు అండగా నిలిచి ఆర్టీఐ యాక్ట్ ద్వారా జరిగిన మొత్తం వ్యవహారాన్ని బట్టబయలు చేయడం జరిగింది.రైతులు పిర్యాదు మేరకు నాటి టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సమగ్ర దర్యాప్తు జరిపి అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని రేఖా. నెం.162/2022 ఎ తే.22.02.2023న కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమునకు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జరిగిన రిజిస్ట్రేషన్ దస్తావేజును రద్దు చేస్తూ ఏదైనా న్యాయస్థానం లేక హై కోర్టు లేక కేంద్ర ప్రభుత్వం లేక రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వుల ప్రతులను జత చేసి రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908, రూలు 26,(1కే1) లో చాలా స్పష్టంగా ఉన్నప్పటికీ సంబంధిత సబ్ రిజిస్ట్రార్లు రెండేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కావున సంబంధిత సబ్ రిజిస్ట్రారులపై సమగ్రమైన విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్టీఐ ఉద్యమ నేత అనపాన షణ్ముఖ రావు రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ కమీషనర్,డిప్యూటీ ఇన్స్ పెక్టర్ జనరల్ లకు పిర్యాదులు రిజిస్టరు పోస్టు ద్వారా పంపినట్లు ఆయన తెలిపారు.

రాగిలో అగ్గితెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కవిటి : రబీలో పండిస్తున్న రాగి పంటలో ప్రస్తుతం వ్యాపిస్తున్న రాగి పంటను అగ్గి తెగులు వ్యాపిస్తుందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం బొరివంక, బట్టివానిపాలెం లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రబీలో వేసిన వరి, రాగి పంటలను పరిశీలించారు. రాగిలో వ్యాపించిన అగ్గి తెగులకు ట్రైసైక్లోజోల్ 1 గ్రామును ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే వరిలో తాటాకు తెగులుకు ప్రొఫెనోపాస్ 2 మిల్లీలీటరులు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో బి.దుర్గా ప్రసాద్, ఏఈవో శ్రీకళ్యాణ్, బడే యతిరాజు, అప్పన్న,గున్న సురేష్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల సముదాయాలు పక్కగా నిర్వహించాలి

విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి

విశాలాంధ్ర - కవిటి : ఈ నెల 15వ తేది శనివారం నాడు ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయాలు ప్రతీ చోట ఉదయం,సాయింత్రం పక్కగా నిర్వహించాలని ఎంఈవో ధనుంజయ మజ్జి అన్నారు. విద్యాశాఖ కమీషనర్ ఆదేశాలు మేరకు కవిటి ఎమ్మార్సీలో స్కూల్ క్లాంప్లెక్స్ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో ప్రాథమిక మరియు స్కూల్ అసిస్టెంట్లకు విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు అమరావతి నుంచి నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతీ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులు హాజరు అయ్యేటట్టు చూడాల్సిన భాధ్యత చైర్మన్లదేనని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఎస్.రామకృష్ణ, బి. మల్లేశ్వరరావు, శివరాం ప్రసాద్ పాడి, నోమితా కుమారి, జి.శాంతి, బందారు సుమలత పాల్గొన్నారు.

మహిళా ఆర్థికాభివృద్దే 'సర్కారు ధ్యేయం'

పియూసి చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్

విశాలాంధ్ర - పొందూరు : రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థిక అభివృద్దే ధ్యేయంగా సర్కారు కృషి చేస్తుందని పియుసి చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక మండల కేంద్రం వెలుగు కార్యాలయంలో డిఆర్డిఏ, సెర్ప్ మహిళా సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ బెస్ట్ ఆర్గనైజేషన్ కార్యక్రమంలో పాల్గొని పై విధంగా అన్నారు. మన ప్రియతమ నేత చంద్రబాబు నాయుడు మహిళలు సమాజంలో తన కాళ్లు పై తానే నిలబడి అభివృద్ధి బాటలో జీవనం సాగించాలన్న దృక్పథం నిరాంతరం నెరవేర్చే దశగా పనిచేస్తున్నారన్నారు. మహిళలకు సమాజంలో భరోసా కలగాలన్నా? గౌరవం పెరగాలన్నా? అది చంద్రబాబు నాయుడు భాటే అభివృద్ధి బాటని మహిళలకు గుర్తు చేశారు. ఆర్థిక భరోసా తోనే మహిళా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వంఎంతో మంచి ఉద్దేశంతో అలనాడే ప్రవేశపెట్టిన డ్వాక్రా సంఘాల ఏర్పాట్లతో స్వయం శక్తితో మహిళ ముందుకు వెళుతుందన్నారు. ప్రతి ఒక్కరూ డోక్రో మహిళా సంఘాలు బలోపేతానికి మరింత కృషి చేసే విధంగా సంఘటితంగా, ఐక్యంగా, ప్రభుత్వ చూపించిన బాటలో నడవాలన్నారు. సర్కారు రుణం తీర్చుకోవడానికి మీరంతా ఐక్యంగా ఐశ్వర్యంతో కష్టాలు లేని జీవితం కొనసాగినప్పుడే సర్కారు రుణం తీర్చుకున్న వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు అరుణ, ఏటీఎం రమణమూర్తి, సీసీ జీ.శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన రామన్న, అచ్చెన్నల కృషి

- జిల్లాకు ఐదు కోట్లు నిధులు మంజూరు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో సంస్థ ప్రతినిధులు భేటీ
- హర్షం వ్యక్తం చేసిన జిల్లా వాసులు
- కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద నిధుల విడుదల

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రాష్ట్రానికి నిధులు తీసుకుని రావడంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల కృషి, సమన్వయం, చొరవ అన్నవి ఫలించాయి. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ల సమష్టి కృషి ఫలితంగా ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రాష్ట్రానికి నిధులు ఇచ్చేందుకు సమ్మతించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ పరిణామం సానుకూల ఫలితాలకు సంకేతికగా నిలుస్తుందని, జిల్లా అభివృద్ధికి దోహదం అవుతుందని సంబంధిత వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. సోమవారం ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, యూఎన్డీఎస్ కన్సల్‌టెన్సీప్రతినిధులు, యునైటెడ్ నేషన్స్ డెవలెప్ మెంట్ అథారిటీ కింద ఈ నిధులతో పలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో విజయవాడలో భేటీ అయి ఇందుకు సంబంధించిన చర్చలు జరిపారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాతో పాటే కుప్పం నియోజకవర్గానికీ నిధులు అందనున్నాయి. ఇప్పటికే సీఎస్ఆర్ కింద ఇటీవల కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో యాభై లక్షల రూపాయలు విలువ చేసే కృత్రిమ పరికరాలను దివ్యాంగులకు అందించే కార్యక్రమానికి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. ఇదే క్రమంలో సీఎస్ఆర్ ఫండ్ ను మరింతగా ఈ ప్రాంత ప్రజలకు వినియోగపడే విధంగా కేంద్ర మంత్రి , రాష్ట్రమంత్రి చొరవ చూపి తీసుకుని రావడంతో జిల్లా ప్రగతి మరింత పురోగమించనుంది. ప్రధానంగా నీటివనరుల అభివృద్ధి, సామాజిక అభివృద్ధి పనులు.వైద్యసదుపాయాల సౌకర్యం, మరియు మానవ వనరుల అభివృద్ధికి సంబంధించిన పనులకు ఈ నిధులు వెచ్చించనున్నారు. నిధులు మంజూరుపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గమ్మ జాతరలో నానాజీ బ్రదర్స్ భక్తులకు ఐదు రోజులు ప్రసాదాలు పంపిణీ

విశాలాంధ్ర - పోలాకి : వెలసివన్న కనక దుర్గమ్మ 23వ జాతర మహోత్సవాలు సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టంకాల శ్రీరాములు గురు భవాని పల్లి రాజు గురు భవాని తెలిపారు. ఈ సందర్భంగా నరస న్నపేట గ్రామ పట్టణానికి చెందిన సాయిబాబా పెరల్స్ సాయి స్వర్ణ ప్యాలస్ అధినేతలైన నానాజీ బ్రదర్స్ దుర్గమ్మ జాతర శుభ సందర్భంగా గుడి వద్ద ప్రతి రోజు సాయంకాలం ఏడు గంటల నుంచి ఉచిత వి విధ రకములు ప్రసాదాలు భక్తులకు 8.2.2025 నుండి 13.2.2025 వరకు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతను ఆ సం స్థ ఉద్యోగి టీవీ పాణిగ్రహిఆధ్వర్యంలో నిర్వహించారు.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయకు నివాళులర్పించిన టెక్కలి బీజేపీ నాయకులు

విశాలాంధ్ర - టెక్కలి : బీజేపీ పార్టీ పూర్వ రూపమైన జన సంఘ్ సిద్ధాంత కర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు జర్జాన రాంజీ అధ్వర్యంలో బిజెపి నాయకులు, దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతమైన ఏకాత్మా మానవతావాదం, అంత్యోదయ బిజెపిలో ప్రతి కార్యకర్త పాటించాలని, వీరి వర్ధంతిని పార్టీ సమర్పణ దివస్ గా పాటిస్తుందని తెలిపారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మోర్చా జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ కోబి కన్వీనర్ నడిపూరు లక్ష్మీనారాయణ, మాజీ మండల అధ్యక్షులు గున మీనా కుమార్, నాగేంద్ర బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్వో సస్పెన్షన్

విశాలాంధ్ర - పొందూరు : మండలం దళ్ళవలన సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న తవుడు ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసారు. ఇటీవల వీఆర్వోపై వచ్చిన ఆరోపణలు పై విచారణ జరిపి పొందూరు తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. పిల్లలవలసలో గ్రామ సభలకు హాజరు కావడంలేదని, గ్రామస్తులకు అందుబాటులో ఉండడం లేదని, మ్యుటేషన్ వంటి పనులకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు, పొందూరు వీఆర్వోగా పనిచేస్తూ తన పరిధినివాటి కృష్ణాపురం సర్వే నెంబరులో పొజిషన్ సర్టిఫికేట్ మంజూరు చేసినట్లు గ్రామానికి చెందిన కెల్ల ఉపేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు, పొందూరు ఎరుకల కాలనీకి సంభందిచిన సర్వేనంబరు 310 ప్రభుత్వ భూమిలో ఎరుకలపేటకు సంభందించి సర్వేనం బరు 358 పేరుతో పొజిషన్ సర్టిఫికేట్ జారీ చేసినట్లు అందిన ఫిర్యాదుమేరకు తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. దీంతో మూడురోజు లక్రితం క్రమశిక్షణా చర్యలు క్రింద ఆర్డేవో కార్యాలయానికి సరెండర్ చేసారు. నివేదిక ప్రకారం ఆరోపణలు నిరూపణ కావడంతో వీఆర్వోను సస్పెండ్ చూస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

శ్రీబానమ్మ,రాములయ్య ట్రస్ట్ సభ్యులు వితరణ

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం బొరివంక గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన తెలగల జగ్గమ్మ, దుర్గాశి ఈశ్వరమ్మ అనే రెండు కుటుంబాలకు నెలకు సరిపడే నిత్యవసర సరుకులను మంగళవారం శ్రీబానమ్మ, రాములయ్య ట్రస్ట్ సభ్యులు హై కోర్ట్ న్యాయవాది, రిటైర్డ్ డీఎస్పీ ఎస్ వి వి ప్రసాదరావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తన చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ సభ్యులు దుద్ది. సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ బి.విజయ్ కృష్ణ, లోళ్ల కింగ్, ఎం.వెంకటేశ్వర రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సముత్వ సర్వే వేగవంతం చేయండి

విశాలాంధ్ర - పలాస : ప్రభుత్వం నిర్దేశించిన సముత్వ సర్వేను వేగవంతం చేయాలని వలాస ఇన్ చార్జ్ డివిజనల్ పంచాయితీ అధికారి గోపీబాల సచివాయ ఉద్యోగులకు అదేశించారు. మంగళవారం పలాస మండలం గంగువాడ, సరియా పల్లి, గ్రామాలలో జరుగుతున్న సముత్వ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముత్వ సర్వే గత ప్రభుత్వం నుంచి సర్వే చేయడం జరుగుతుందని మద్యలో సార్వత్రిక ఎన్నికలు రావడం వల్ల నిలిచిపోయిందన్నారు. ఈ సర్వేలో ఇంటింటికి సర్వే చేసి ఇంటి పన్ను ఆదారంగా ఇంటి హద్దులుతో కలిగిన బుక్ లెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలా గ్రామాలలో సర్వే త్వరతగతిన చేయడం జరుగుతుందని చెప్పారు. సర్వేలో వెనకబడిన ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాలలో పర్యటించి సచివాలయ ఉద్యోగులుతో సర్వే వేగవంతం అయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఆయనతో పాటు వలాస మండల పంచాయితీ విస్తరణ అధికారి మెట్ట వైకంఠరావు, పంచాయితీ కార్యదర్శులు లండ శ్రీధర్, ఆశ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్సుల కండిషన్‌పై పర్యవేక్షణ ఉండాలి..పలాస డిపో పరిధిలో రోడ్ టెస్ట్‌లు

విశాలాంధ్ర - పలాస : డిపో పరిధిలో ఉన్న ఆర్టీసీ బస్సుల కండిషన్ పై పర్యవేక్షణ ఎల్లప్పుడూ ఉండాలని విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కే శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పలాస డిపో గ్యారేజీలో బస్సులు మెయింటెనెన్స్ విభాగాలను పర్యవేక్షించిన ఆయన గ్యారేజీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్యారేజీ సిబ్బందితో కలసి షెడ్యూల్-3 బస్సును రోడ్డు టెస్ట్ నిర్వహించారు. బస్సులు మార్గమధ్యంలో ఆగకుండా సంతృప్తి కరమైన ప్రయాణాన్ని ప్రయాణికులకు అందించ వలసిందిగా కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితవంతమైనవి, సౌకర్యవంతమైనవి అని ప్రయాణికులు విశ్వసించేలా ఆర్టీసీ సేవలు ఉండాలన్నారు. డిపోలోని డ్రైవర్లతో మాట్లాడి బస్సులు యొక్క లోటుపాట్లు తెలుసుకొని వాటి సరిదిద్ద వల్సినదిగా గ్యారేజ్ సిబ్బందికి తెలియజేశారు. ఈ రోడ్డు టెస్ట్‌లో డిపో మేనేజర్ పలాస ఆర్ఎస్ నాయుడు గ్యారేజ్ ఇంచార్జ్ హేమంత్ కుమార్, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మావుడూరి మహనీయులు మరి లేరు

విశాలాంధ్ర - పోలాకి : పోలాకి గ్రామంలో బ్రాహ్మణ వీధికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు విశ్రాంత ఉపాధ్యాయుడు రంగస్థల నటుడు మావుడూరు భీమారావు (90) మంగళవారం పోలాకిలో తుది శ్వాస విడిచారు. ఆయనకు పలు రాష్ట్రాల్లో సంగీత శిష్యగణం కలిగి ఉన్నారు. భీమారావు కి భార్య ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల సంగీత లోకం సంతాపం తెలియజేసింది. మరుపురాని మనిషి మహనీయులు మావుడూరి భీమారావు మాస్టారు లేరని సంగతి తెలుసుకొని పోలాకి ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ ప్రాంతములో సంగీత సాహిత్యాలలో శుభ ముహూర్తాల్లో మావుడూరి లేకుండా జరిగేది లేదు. ఆయన పెట్టిన ముహూర్తం గ్రామ ప్రజలకు మంచి జరుగుతాదని నమ్మకం. 60 ఏళ్లుగా తెలుగు పండితులుగా పనిచేసి తెలుగు భాష పై పట్టు సాధించారు. ఇంతటితో ఆగని ఆయన చిన్నతనం నుండే సంగీతములో మంచిపట్టున్న కళాకారులు ఎంతోమంది ఆయన వద్ద సంగీతం నేర్చుకొని మన్ననలను పొందారు. సరిగమపదనిస లుతో ప్రారంభమై 40 సంవత్సరాలు హార్మోనియం సంగీతంలో మధురమైన వాయిద్యంలో జిల్లాలో మంచి పేరుగాంచినవారు ఉండరు. సంగీతములో దిట్ట నేటి వరకు చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఇంటి వద్దనే సంగీతం నేర్పించి కళాకారుల మన్ననలు పొందిన మహనీయుడు మరి లేరని మరణించిన వార్త తెలుసుకున్న కళాకారులు జీర్ణించుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రతి ఒక్కరూ అక్కడికి వచ్చి కంటి తడిపెట్టారు. బుధవారం నాడు అంత్యక్రియలు జరుగు చు న్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పింఛను అందించండి మహాప్రభో 88 ఏళ్ల చేనేత వృద్ధుడు సోములు

విశాలాంధ్ర - జలుమూరు : సుమారు యాదాదిగా పింఛన్ ఆగిపోయిందని తన ప్రాణాలు పోకముందే రావలసిన పింఛన్ అందించాలని జలుమూరు మండలం నగరికటకం గ్రామానికి చెందిన పిచ్చిగా సోములు 88 అన్నారు. 100 రూపాయలు పింఛన్ నుండి తాను చేనేత కార్మికుడిగా అందుకు ఉండేవాడినని ఏడాది క్రితం అనారోగ్యంతో నా కుమారుడు హైదరాబాద్ తీసుకుని వెళ్లాడని వైద్యపరీక్షల అనంతరం 2024 మార్చిలో స్వగ్రామం నగరికటకం చేరానని పింఛన్ అందడం లేదని ఆందోళన చెందారు. తనకు ఎటువంటి ఆధారం లేదని కేవలం పెచిన తో కుమారుడు తోలిన కొద్దిపాటి డబ్బులతో అనారోగ్యంతో ఉన్న నా భార్య తాను జీవితం గడపవలసి వస్తుందని పింఛను లేనందున అనేక బాధలు పడుతున్నామని సోముల అన్నారు. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆయన స్పందించి తాసిల్దార్ కు ఇంటికి పంపించాలని దరఖాస్తు రాసుకొని వెళ్లారు. తప్ప నేటి వరకు పింఛన్ రాలేదని ఆందోళన చెందుతున్నారు పాలకులు పరిశీలించి నాలాంటి వృద్ధునికి ఆదుకోవాలని సోములు కోరారు.

ఉపాధ్యాయుని ఆత్మహత్య

విశాలాంధ్ర - కంచిలి : కంచిలి మండలం కెబి నౌగంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుని కుమారి సుస్మిత పాత్ర (44) ఇంటి వద్ద ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డారు. ఆమెకు భర్త ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త దేవేంద్ర బ్రహ్మ ఒరిస్సాలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు అలానే పెద్ద కుమారుడు సుమన్ బ్రహ్మ వైజాగ్‌లో ఇంటర్మీడియట్ చదువుతుండగా చిన్న కుమారుడు సూరజ్ బ్రహ్మ స్థానికంగా మూడవ తరగతి చదువుతున్నాడు. స్థానికులు పోలీసులకు ఇచ్చిన సమాచారం ప్రకారం ఎప్పటిలానే సోమవారం విధులు నిర్వర్తిస్తు సాయంత్రం నాలుగు గంటల సమయం లో ఇంటికి చేరుకొని లోపల నుండి గడియ పెట్టుకొని ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడినట్లుగా ఉంది అన్నారు. సాయంత్రం భర్త నాలుగు గంటల ముప్పై నిముషాల సమయం లో ఇంటి వద్దకు చేరుకోగా లోపల నుండి తలుపు లు పెట్టి ఉండడం తో ఎంత సమయం వరకు తెయకపోవడం తో తలుపులు బద్దలు కొట్టి లోపలకి చూసేసరికి సుస్మిత పాత్ర ఫ్యాన్ కు విగతజీవిగా చూసిన స్థానికులు కన్నీరుమున్నీరు అయ్యారు. అలానే అదేసమయంలో స్కూల్ నుండి తిరిగి వచ్చిన చిన్న కుమారుడు సూరజ్ బ్రహ్మ అమ్మ నీ అలా చూసేసరికి బోరున విలపిస్తూ ఏడ్చిన ఆ పసికందు నీ చూసిన స్థానికులు చలించిపోయారు. మరో 22 రోజుల వ్యవధిలో ఇంట ర్మీడియట్ పరీక్షలు రాయాల్సిన పెద్ద కుమారుడు విషయం తెలియడం తో గుండె నిండా దుఃఖాన్ని మిగిల్చింది. ఇంత కి సమాజంలో ఒక గౌరవ ప్రదమైన ఉద్యోగం చేస్తున్న ఆమె ఈ విధమైన చర్య కు పాల్పడడం వెనుక ఏం జరుగుంటుందని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికులు భర్త ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజిలెన్స్ అధికారులు తనిఖీ

విశాలాంధ్ర - నందిగాం : స్థానిక పంచాయతీ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ జిల్లా అధికారి బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు వివిధ దస్త్రాలను మంగళవారం తనిఖీ చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో 14, 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదలైన సుమారు 30 లక్షల నిధులతో చేపట్టిన పనులకు సంబం ధించిన దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అంతేకాకుండా క్షేత్ర స్థాయిలో జరిగిన పనులను సైతం పరిశీలించారు. నందిగాం, పెంటూరు గ్రామాల్లో బీసీ కాలనీలో జరిగిన సీసీ రోడ్లు కాలువలు పనులు నందిగాం ఎదురుల బందలో జరిగిన మెట్లు నిర్మాణ పనులు, నందిగాం శివాలయం సమీపంలో వేసిన కచ్చా కంకర రహదారి పనులను పరిశీలించారు తనిఖీలు చేపట్టిన వారిలో సీఐ సతీష్ ఏఈ రవి కిషోర్ ఆడిటర్ ఎర్న్ నాయుడు ఉన్నారు.

దాతల సహకారంతో రేకుల షెడ్లు ఆధునీకరణ

విశాలాంధ్ర - పొందూరు : మండలం తాడివలస ఉన్నత పాఠశాలలో ఉన్న రెండు రేకుల షెడ్లను దాతల సహకారంతో ఆధునీకరించడమైనదని ప్రధానో పాధ్యా యులు బల్ల కంటయ్య తెలిపారు. తాడివలస గ్రామానికి చెందిన స్వర్గీయ తమ్మినైన సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సమకూర్చిన ఒక లక్షా యాభై వేల రూపాయలతో ఈ రేకుల షెడ్లు పునర్నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. గతంలో భోజన శాల నిర్మాణానికి, పాఠశాల మైదానం ఎత్తు చేయడానికి మరియు మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సహాయం అందజేసినట్లు చెప్పారు.మంగళవారం పాఠశాలను సందర్శించి వారి ఆర్థిక సహకారంతో అభివృద్ధి చేసిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు.

కేజీబీవీలో అవేర్నెస్ ప్రోగ్రాం ... పాల్గొన్న ఎస్సై అనిల్ కుమార్

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రం సారవకోట కేజీబీవీ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హై స్కూల్ కళాశాల విద్యార్థులు సోషల్ మీడియా వైపు దృష్టి సారించకూడదని ఆయన అన్నారు. గ్రామాల్లో తల్లిదండ్రులు ఎంతో ఆశ్రయంతో మన మీద నమ్మకంతో చదువులకు పంపిస్తున్నారని వారి ఆశయాలు కొనసాగించాలని ఆయన సూచించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో అనేక ఇబ్బందులు జరుగుతున్నట్లు మనందరం చూస్తున్నామని కనుక మనం జాగ్రత్తగా నడవాలని ఆయన విద్యార్థినులకు సూచించారు. ఆయనతోపాటు కేజీబీవీ ప్రత్యేక అధికారిని అరుణ నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిర విగ్రహం ఏర్పాటుకు ఆటంకాలు సరికాదు : డీసీసీ అధ్యక్షులు అంబటి కృష్ణారావు

విశాలాంధ్ర - పలాస : పలాస చౌక్ వద్ద దివంగత మాజీ ప్రధాని ఇంద్ర గాంధీ విగ్రహం ఏర్పాటు పై ఆటంకాలు పెట్టడం సరికాదని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అన్నారు. మంగళవారం హరికృష్ణ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆవిర్భావానికి ముందే పలాస మూడు రోజుల కూడలిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ విగ్రహం గత ప్రభుత్వ హయాంలో కేటీ రోడ్డు వెడల్పు చేసిన సమయంలో ఇందిరమ్మ విగ్రహం తొలగించి మున్సిపల్ కార్యాలయంలో భద్రపరిచారని తెలిపారు. విగ్రహం నెలకొల్పిన ప్రాంతాన్ని ఇందిరా చౌక్ గా పేరుగాంచిందని, పోస్ట్ ఆఫీసులో గాని, గూగుల్ చర్చ్ చేసినప్పుడుగాని ఆ విగ్రహం వెలసిన చోటును ఇప్పటికీ ఇందిరా చౌక్‌గా చూప బడుతుందన్నారు. రోడ్లు వెడల్పు కార్యక్రమం పనులు పూర్తయిన తర్వాత ఇందిరమ్మ విగ్రహం పున: ప్రతిష్టను మున్సిపాలిటీ చేయలేదని ఈ విషయమై గతంలో పలుసార్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ అధికారులను, మున్సిపల్ ప్రజా ప్రతినిధులను కోరడం జరిగిందని అన్నారు. అయినాప్పటికి ఇందిరమ్మ విగ్రహం పున: ప్రతిష్ట జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహం ఏర్పాటు పై గత డిసెంబరు 13న జిల్లా కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ అధికారులను కలవడం, వారు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా స్థలం చూపించడం జరిగిందని, డిసెంబర్ 14న భూమి పూజ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. కాగా ఫిబ్రవరి 5న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు,మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో మున్సిపల్ శాఖ సిబ్బంది చూపించిన స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటుకు కావలసిన స్థూపం కట్టడానికి సన్నాహం జరుగుతున్న సమయంలో మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు చేశారని డాక్టర్ దువ్వాడ జీవితేశ్వర రావు ను పోలీసులు పోలీస్ స్టేషన్ కు పిలిపించడం జరిగిందని,పోలీసుల సూచన మేరకు ఈ నెల 7న మున్సిపల్ కమిషనర్ ఎన్. రామారావు ను డాక్టర్ జీవితేశ్వరరావు కలవగా, తాను ఎవరి మీద ఫిర్యాదు చేయలేదని, మా ఫిర్యాదులో ఎవరి పేరు రాయలేదని చెప్పడం జరిగిందన్నారు. ఇది డాక్టర్ జీవితేశ్వరరావుకు కొంత మనస్థాపం, ఇబ్బంది కలిగిందని తెలుసుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులు, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ఇన్చార్జిలు, మహిళ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కు తమ సంఘీభావం తెలియజేశామన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన దివంగత నేత ఇందిరా గాంధీ విగ్రహాన్ని పున: ప్రతిష్ట కోసం పార్టీ శ్రేణులు సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.సమావేశం ముందు భారత మాజీ రాష్ట్రపతి ఫ్రక్రుద్దీన్ ఆలీ అహ్మద్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావుకు బాసటగా నిలిచి సంఘీభావం తెలిపిన వారిలో పలాస నియోజకవర్గం ఇంచార్జ్ తెంబూరి మదుసూదనరావు, కిసాన్ సెల్ నాయకులు ఉప్పాడ రాజారావు మాస్టర్, మందస బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొర్ల హేమారావ్ చౌదరి, మందస మండల కాంగ్రెస్ అధ్యక్షులు మజ్జి బాబురావు, సాసుమాన లోకేశ్వరరావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ శ్రీకాకుళం సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కె ఎల్ వి ఈశ్వరి, ఇచ్ఛాపురం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి చక్రవర్తి రెడ్డి, నరసన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మామిడి సత్యనారాయణ, ఆముదాలవలస నియోజకవర్గ ఇన్చార్జి బొత్స రమణ, ఎచ్చెర్ల ఇన్చార్జ్ ఆంబోతు రమణ, మరియు భాష, ఇజ్జు రమణ, దాలయ్య, అప్పారావు, కే కృష్ణారావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.తనకు బాసటగా నిలిచి సంఘీభావాన్ని తెలియజేసిన జిల్లా కాంగ్రెస్ నాయకత్వానికి మరియు జిల్లా కాంగ్రెస్ శ్రేణులకు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం చేరుకొని ఇందిరమ్మ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ కమిషనర్ నడిపెన రామారావుకు వినతి పత్రం అందజేశారు.